## క్లుప్తంగా

### ట్యాక్స్ కట్టని వాహనాలకు జరిమానా

**రౌతులపూడి:** మండలంలోని గత కొంతకాలంగా ట్యాక్స్ కట్టకుండా నడుపుతున్న ఏడు వాహనాల గుర్తించి రూ.85 వేలు జరిమానా విధించినట్లు కత్తిపూడి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాస్ తెలిపారు. మండలంలో వివిధ ప్రధాన రహదారుల్లో సోమవారం ఆయన వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ట్యాక్స్ కట్టని పలు ట్రాక్టర్లు, గూడ్స్ వాహనాలను గుర్తించామన్నారు. వాహన యజమానులు తమ వాహనాలకు తప్పనిసరిగా రోడ్డు ట్యాక్స్ కట్టాలన్నారు. ఎవరైనా ట్యాక్స్ కట్టకుండా వాహనాలను నడిపితే జరిమానా తప్పదని ఆయన హెచ్చరించారు.

### రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు

**తొండంగి:** మండలంలోని రైతులు పండించిన ఖరీఫ్ ధాన్యాన్ని ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తుందని మండల వ్యవసాయాధికారి ఎస్.నరసింహం తెలిపారు. రైతులు పండించిన ధాన్యానికి ప్రభుత్వం కనీస మద్దతు ధర ప్రకటించిందన్నారు. సాధారణ రకం 75 కిలోలకు రూ.1725, ఏ గ్రేడ్ రకానికి రూ1740గా నిర్ణయించిందన్నారు. ధాన్యం కొనుగోలుకు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా మార్గదర్శకాలు జారీ చేసిందన్నారు. ఈ మేరకు రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వ అధికారులు ధాన్యం కొనుగోలు చేస్తారని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దళారులను నమ్మి మోసపోవద్దన్నారు.

### గ్రీవెన్స్‌కు మూడు దరఖాస్తులు

**గండేపల్లి:** స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల ప్రజా వేదిక (గ్రీవెన్స్) కార్యక్రమానికి మూడు అర్జీలు వచ్చినట్టు ఎంపీడీఓ నాతి బుజ్జి తెలిపారు. మరణ ధ్రువీకరణ పత్రం, పెన్షన్, డ్రైనేజీ సమస్యలపై దరఖాస్తులు వచ్చినట్టు వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ కేహెచ్ నాయక్, ఏపీఓ గంగాభవాని, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

### నేటి నుంచి ప్రత్యేక ఆధార్ శిబిరాలు

**ప్రత్తిపాడు:** ఆధార్ డాక్యుమెంట్ వెరిఫికేషన్, బయోమెట్రిక్ అప్‌డేట్, న్యూ ఎన్‌రోల్‌మెంట్ కోసం మంగళవారం నుంచి గ్రామాల్లో ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు తెలిపారు. ఈ శిబిరాలు ఈ నెల 25 వరకు కొనసాగుతాయని చెప్పారు. ప్రజలు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### అభివృద్ధి పనులకు శంకుస్థాపన



జగ్గంపేటలో అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

**గండేపల్లి:** గ్రామాల్లో ప్రతి ఇంటికీ రెండు కుళాయిల ద్వారా తాగునీరు అందించనున్నట్టు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తెలిపారు. పల్లె పండుగ–పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా జగ్గంపేట, గొల్లలగుంట గ్రామాలలో రూ.6.51 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్‌తో కలిసి సోమవారం ఆయన భూమి పూజ చేశారు. కార్యక్రమంలో డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి, ఎంపీపీ అత్తులూరి నాగబాబు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎస్వీఎస్ అప్పలరాజు, మాజీ ఎంపీపీ మారిశెట్టి భద్రం, జగ్గంపేట ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కొత్త కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

### గ్రామాల పరిశుభ్రతే లక్ష్యం

**శంఖవరం:** గ్రామాల పరిశుభ్రతే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని ఎంపీడీఓ ఎస్ఎన్ శర్మ సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీరు సమస్య లేకుండా చూడాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

### అన్నసమారాధన

**కిర్లంపూడి:** మండలంలోని రామచంద్రపురం కనకదుర్గమ్మ ఆలయం వద్ద సోమవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. దసరా ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అయ్యప్పస్వాములకు జనసేన పార్టీ జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ నివాసంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు.

**నేడు అన్నదానం**

**కోటనందూరు:** స్థానిక శివాలయ ప్రాంగణంలో మంగళవారం భారీ అన్నదానం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. శ్రీషిర్డీసాయి నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా గ్రామపెద్దల సహకారంతో ఈ అన్నదానం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### సారా బట్టీలపై పోలీసుల దాడి

**కిర్లంపూడి:** మండలంలోని గెద్దనాపల్లి గ్రామ శివారులో సారా బట్టీలపై సోమవారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో 500 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్టు స్థానిక ఎస్సై సతీష్ తెలిపారు. సారా తయారు చేస్తున్న వి.శ్రీనును అరెస్టు చేశారు. నిందితుడిని కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్టు ఎస్సై తెలిపారు.

# గృహాలు శిథిలం.. ప్రాణాలెలా పదిలం

- అవసానదశలో పోలీస్ క్వార్టర్స్
- బిక్కుబిక్కుమంటూనే నివాసం
- పట్టించుకోని అధికారులు



ప్రత్తిపాడులో శిథిలమైన పోలీసు క్వార్టర్లు



పిచ్చి మొక్కలు పెరిగిపోయి ఉనికి కోల్పోయిన ప్రత్తిపాడు ఎస్సై క్వార్టర్

**ప్రత్తిపాడు:** శాంతిభద్రతలను కాపాడే పోలీసుల నివాస గృహాలు (పోలీస్ క్వార్టర్స్) శిథిలావస్థకు చేరుకున్నాయి. పోలీసులు విధుల నిర్వహణలో ఉంటే ఈ క్వార్టర్లలో ఉంటున్న వారి కుటుంబాలు బిక్కుబిక్కుమంటూ ఏ క్షణంలో కూలుతుందోనన్న భయంతో గడుపుతున్నారు. స్థానిక సర్కిల్ పరిధిలో ప్రత్తిపాడు, ఏలేశ్వరం, అన్నవరం పోలీస్ స్టేషన్లు ఉండగా రౌతులపూడిలో పోలీస్ అవుట్ పోస్టును ఇటీవలే ఏర్పాటు చేశారు. ప్రత్తిపాడు, అన్నవరం పోలీస్ స్టేషన్లకు మాత్రమే అప్పట్లో ఎస్సై, పోలీసులకు నివాస గృహాలు (క్వార్టర్స్) నిర్మించారు. వీటిని నిర్మించిన నాటి నుంచి కనీస మరమ్మతులు చేపట్టలేదు. క్వార్టర్లలో నివాసం ఉండే పోలీసు సిబ్బంది మాత్రం నామమాత్రంగా అవసరానికి అనుగుణంగా సొంత నిధులతో మరమ్మతులు చేయించుకొని జీవనం కొనసాగించారు. క్రమేపీ శిథిలావస్థకు చేరుకోవడంతో కొన్నేళ్లుగా ఎవరూ అందులో కాపురం ఉండటం లేదు. ఒకటి, రెండు క్వార్టర్లలో నివశిస్తున్న రక్షకభటులు బిక్కుబిక్కు మంటూ జీవనం సాగిస్తున్నారు.

**1994లో నిర్మాణం**

ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో పోలీసులకు 16 క్వార్టర్లతో కూడిన ఎనిమిది పక్కా భవనాలను, ఎస్ఐకు ప్రత్యేకంగా ఒక భవనాన్ని 1994వ సంవత్సరంలో నిర్మించారు. ఈ పోలీసు గృహ సముదాయాన్ని 1995 మే 11వ తేదీన అప్పటి రాష్ట్ర హోం మంత్రి పి. ఇంద్రారెడ్డి ప్రారంభించారు. అప్పట్లో ఈ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న 16 మంది పోలీసులకు ఈ క్వార్టర్లను కేటాయించారు. సుమారు 30 ఏళ్లుగా ఈ భవన సముదాయానికి కనీస మరమ్మతులు చేపట్టిన దాఖలాలు లేవు. ప్రస్తుతం ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్‌లో ఒక ఎస్సైతో పాటు సుమారు 30 మంది పోలీసు సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ క్వార్టర్లు నేడో రేపో కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. ప్రమాదకరంగా ఉన్నప్పటికీ రెండు క్వార్టర్లలో పోలీసు కుటుంబాలు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నాయి. చిన్నచిన్న మరమ్మతులకు సొంత నిధులు ఖర్చు చేసుకోవాల్సి వస్తోందని పోలీసులు వాపోతున్నారు.

**బోర్డులు వేలాడుతూ..**

పోలీసు క్వార్టర్లలో విద్యుత్ వైరింగ్ కాలిపోయి, బోర్డులు వేలాడుతున్నాయి. కిటికీ తలుపులు ఏనాడో ఊడిపోయాయి. తలుపులు కూడా రక్షణ ఇవ్వలేని దుస్థితిలో ఉన్నాయి. గోడలకు వేసిన సిమ్మెంట్ పూత కూడా పెచ్చులూడి పడుతున్నాయి. బాత్‌రూమ్‌లకు తలుపులు పూర్తిగా ఊడిపోయాయి. తప్పని పరిస్థితిల్లో కాపురం ఉండాల్సి వస్తోందని పోలీసు కుటుంబాలు చెబుతున్నాయి. డ్రైనేజీ వ్యవస్థ లేనే లేదు. శిథిల భవనాల ఆవరణలో తుప్పలు పెరిగిపోయి, విష సర్పాలకు ఆవాసాలుగా మారాయి. స్వచ్ఛ భారత్ వంటి కార్యక్రమాలప్పుడు మాత్రమే పోలీసులు తుప్పలు నరికికాస్త శుభ్రం చేయడం, తిరిగి తుప్పలు పెరిగిపోవడం జరుగుతూ వస్తోంది. ప్రత్తిపాడులోని పోలీసు క్వార్టర్లు నిర్మించి దాదాపు మూడు దశాబ్దాలు దాటడంతో నివాసానికి పనికి రావని ఆర్అండ్‌బీ అధికారులు ఏనాడో ధ్రువీకరించారు. ప్రమాదకరంగా ఉన్న వీటిని ఉపయోగించరాదని వారు స్పష్టం చేసినట్టు పోలీసు సిబ్బంది తెలిపారు. ఇక అన్నవరం క్వార్టర్ల విషయానికొస్తే ఒక ఎస్సై క్వార్టర్‌తో పాటు 10 పోలీసు సిబ్బందికి క్వార్టర్లు నిర్మించారు. వీటికి కూడా మరమ్మతులకు చేపట్టక పోవడంతో క్రమంగా శిథిలావస్థకు చేరుకున్నాయి. శిథిలమైన క్వార్టర్ల స్థానంలో నూతనంగా క్వార్టర్లు నిర్మించాలని పోలీసు సిబ్బంది కోరుతున్నారు.



శిథిలమైన అన్నవరం పోలీస్ క్వార్టర్లు

**ప్రతిపాదనలు పంపుతాం**



పోలీసు సర్కిల్ పరిధిలోని ప్రత్తిపాడు, అన్నవరం పోలీసు స్టేషన్లలో విధులు నిర్వర్తించే ఎస్సై, సిబ్బందికి నిర్మించిన క్వార్టర్లు నివాసయోగ్యంగా లేవు. దాదాపు కూలిపోయే స్థితిలో ఉన్నాయి. వీటి స్థానంలో నూతనంగా క్వార్టర్ల నిర్మించాలని కోరుతూ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతాం.

– బి. సూర్య అప్పారావు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్, ప్రత్తిపాడు

# అమ్మవారి విగ్రహం పునఃప్రతిష్ఠ



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



జగ్గంపేటలో ప్రతిష్ఠించిన సత్తెమ్మతల్లి విగ్రహం

**కిర్లంపూడి:** జగపతినగరం గ్రామ శివారున వేంచేసిన దుర్గమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహాన్ని సోమవారం పునఃప్రతిష్ఠించారు. 18 ఏళ్ల క్రితం నిర్మించిన అమ్మవారి శిథిలావస్థకు చేరుకుంది. దీంతో చిట్టిబోయిన సూర్యనారాయణ దంపతులు సొంత ఖర్చులతో నూతన గుడిని నిర్మించారు. దీనిలో భాగంగా దుర్గమ్మ అమ్మవారి విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయంలో ఏకాహం నిర్వహించారు.

**భక్తిశ్రద్ధలతో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ**

**గండేపల్లి:** జగ్గంపేట శివారులో జాతీయ రహదారిని ఆనుకుని నూతనంగా నిర్మించిన ఆలయంలో సత్తెమ్మతల్లి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సోమవారం కన్నులపండువగా జరిగింది. గ్రామానికి చెందిన యర్ర వెంకట్రావు, రాజ్యలక్ష్మి, వెంకటసోమనాయుడు, విశాలి దంపతుల ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

# అమరవీరులను ఆదర్శంగా తీసుకోవాలి



తుని పట్టణ పోలీస్‌స్టేషన్‌లో అమరవీరుల స్థూపానికి నివాళులర్పిస్తున్న సీఐ గీతా రామకృష్ణ, మహిళా పోలీసులు



ప్రత్తిపాడు అల్లూరి జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడిన పోలీసులు, విద్యార్థులు

**తుని:** దేశం కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరులను ఆదర్శంగా తీసుకోవాలని తుని పట్టణ సీఐ గీతా రామకృష్ణ సూచించారు. తుని పట్టణ పోలీస్ స్టేషన్‌లో సోమవారం అమరవీరుల సమస్మరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అమరవీరుల చిహ్నానికి సీఐ గీతారామకృష్ణ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1959 అక్టోబర్ 21న భారత్, చైనా సరిహద్దులోని లడక్ హాట్ స్ప్రింగ్ వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తున్న 10 మంది సీఆర్పీఎఫ్ జవాన్లపై శత్రువులు దాడి చేయగా ప్రతిఘటించి వీర మరణం పొందారన్నారు. వారి త్యాగాలకు ప్రతీకగా దేశ వ్యాప్తంగా అమరవీరుల దినోత్సవం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఏడాది కాలంలో దేశ వ్యాప్తంగా 216 మంది పోలీసులు విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయారన్నారు. ఈ సందర్భంగా వారం రోజుల పాటు ర్యాలీలు, ఓపెన్ హౌస్‌లు, విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. రైటర్ సూరిబాబు, హెడ్‌కానిస్టేబుల్స్ శ్రీనివాస్, యాదవ్, సచివాలయం మహిళా పోలీసులు, హోంగార్డులు పాల్గొన్నారు.

**అమరవీరుల త్యాగాలు అజరామరం**

**ప్రత్తిపాడు:** సమాజ రక్షణలో భాగంగా పోలీసులు చేస్తున్న త్యాగాలు అజరామరమని ప్రత్తిపాడు సీఐ బి. సూర్యఅప్పారావు కొనియాడారు. పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో సోమవారం అమరులైన పోలీసులకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పోలీసులు పోలీస్ స్టేషన్ నుంచి అల్లూరి సీతారామరాజు సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించి, మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో ఎస్సై ఎస్ లక్ష్మీకాంతం, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# జగన్ మళ్లీ సీఎం కావాలని కోరుతూ పూజలు



సత్యదేవుని తొలిపాంచా వద్ద పేదలకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న వరుపుల సుబ్బారావు దంపతులు

**అన్నవరం:** మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని కోరుతూ సత్యదేవునికి పూజలు చేసినట్లు ఆ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి వరుపుల సుబ్బారావు తెలిపారు. సోమవారం ఆయన జన్మదినం సందర్భంగా రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై అందరూ ఐక్యంగా పోరాడాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ఊరూరా మద్యం దుకాణాలు మాత్రం ఏర్పాటు చేశారని ఆయన విమర్శించారు. అనంతరం వరుపుల దంపతులను పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రౌతులపూడి జెడ్పీటీసీ గొల్లు చినదివాణం, మండపం సర్పంచ్ కూనిశెట్టి మాణిక్యం, వజ్రకూటం సర్పంచ్ సకురు గుర్రాజు, నెల్లిపూడి సర్పంచ్ నరాల శ్రీను, అన్నవరం ఉపసర్పంచ్ బొబ్బిలి వెంకన్నబాబు పాల్గొన్నారు.

# భక్తులకు సత్యదీక్షా వస్త్రాల పంపిణీ



ప్రత్తిపాడులో సత్యదీక్షా వస్త్రాలు పంపిణీ చేస్తున్న కృష్ణబాబు తదితరులు

**ప్రత్తిపాడు:** జీవితంలో ఒకసారైనా సత్యదీక్ష మాలాధారణ ధరించాలని సత్యదీక్ష ప్రచార కర్త నల్లమిల్లి కృష్ణబాబు భక్తులను కోరారు. స్థానిక మునసబు గారి వీధిలో సత్యదీక్ష చేపట్టనున్న భక్తులకు నూతన వస్త్రాలు, పూజా విధానాన్ని వివరించే పుస్తకాలను సోమవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 27న వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి సత్యదీక్ష చేపట్టే భక్తులకు దీక్షా వస్త్రాలు, పుస్తకాలను పంపిణీ చేస్తున్నామన్నారు. ఇప్పటివరకు మండలంలోని ప్రత్తిపాడు, ధర్మవరం, పెద్దాపురం మండలం తొలి తిరుపతి, కిర్లంపూడి మండలం సోమరాయునిపేట, వేలంక, గొల్లప్రోలు మండలం చెందుర్తి, శంఖవరం మండలం గౌరంపేట, సూళ్లూరిపేట గ్రామాల్లో సత్యదీక్షా వస్త్రాలను పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో అన్నవరం ట్రస్ట్‌బోర్డు మాజీ సభ్యుడు శింగిలిదేవి సత్తిరాజు, మాచవరపు వీరభద్రరావు, తంగెళ్ళ రాంబాబు, దొడ్డిపట్ల వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాన రహదారిపై ఉధృతంగా వరదనీరు



రాకూరుపాలెం చెక్‌పోస్టు వద్ద ప్రధాన రహదారిపై ఉధృతంగా ప్రవహిస్తున్న వరదనీరు

**గోకవరం:** మండలంలోని గోకవరం–జగ్గంపేట ప్రధాన రహదారిపై రాకూరుపాలెం చెక్‌పోస్టు సమీపంలో కొండవాగు పొంగి పొర్లడంతో ప్రధాన రహదారిపై వరద నీరు ఉధృతంగా ప్రవహించింది. సోమవారం మండలంతో పాటు ఏజెన్సీ ప్రాంతంలో భారీ వర్షం కురిసింది. దీంతో కొండవాగుల్లోకి వరదనీరు చేరి పొంగి పొర్లడంతో ప్రధాన రహదారిపై భారీగా వరద నీరు ప్రవహించింది. సుమారు గంట పాటు వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో ఇరు పక్కల వాహనాలు భారీగా నిలిచిపోయాయి. దీంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. సుమారు గంట తరువాత వరద ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో వాహనాల రాకపోకలు యథావిధిగా కొనసాగాయి.

### ఫీజు రీయింబర్స్‌మెంట్ సొమ్ము విడుదల చేయాలి

**తుని:** విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు జి.రాము డిమాండ్ చేశారు. స్థానిక డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో సోమవారం ఆయన చర్చించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి నాలుగు నెలలు కావస్తున్నా నేటికీ ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ప్రకటన చేయకపోవడం అన్యాయమన్నారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో ఉన్నత విద్యనభ్యసించే పేద, మధ్య తరగతి విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. ఫీజులు కట్టకపోతే పరీక్షలు రాయనీయమని యాజమాన్యాలు ఒత్తిడి చేస్తున్నాయన్నారు. కాకినాడ జిల్లాలో 20 వేల మంది విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారని, వీరంతా తీవ్ర ఆందోళనలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంపై నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# ప్రతిష్టాత్మకంగా బీజేపీ సభ్యత్వ నమోదు



విలేకరులతో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేటుకూరి సూర్యనారాయణరాజు

**గోకవరం:** ఆరేళ్ల తరువాత బీజేపీ సభ్యత్వ నమోదును ప్రతిష్టాత్మకంగా చేపట్టినట్టు ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేటుకూరి సూర్యనారాయణరాజు తెలిపారు. స్థానిక సీఎండీకేఎస్‌పీపీ లే అవుట్‌లో సోమవారం ఆయన విశ్వహిందూ పరిషత్ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్ రావును కలుసుకుని అభినందించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణరాజు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలో బీజేపీ పటిష్టంగా ఉందన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకూ సుమారు 17 లక్షల సభ్యత్వాలను నమోదు చేశారన్నారు. కంబాల శ్రీనివాస్‌రావు 17,800 బీజేపీ సభ్యత్వాలను నమోదు చేయించడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు వత్సవాయి వరాలబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టా మంగరాజు, మండలాధ్యక్షుడు సత్తి వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఇనకోటి బాపన్నదొర తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి రీసర్వేపై గ్రామసభలు



సమావేశంలో పాల్గొన్న వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు

**ప్రత్తిపాడు:** రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో మంగళవారం నుంచి రెవెన్యూ సిబ్బంది సభలు నిర్వహించాలని తహసీల్దార్ ఎం.సూర్యప్రభ ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బందితో రీ సర్వే గ్రామ సభలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏఏ గ్రామాల్లో సర్వే పూర్తయ్యింది, రీ సర్వే చేపట్టవలసిన గ్రామ పరిస్థితులపై వీఆర్వో, గ్రామ సర్వేయర్లను ఆరా తీశారు. రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో ఈ నెల 22వ తేదీ నుంచి నవంబర్ 24 వరకు గ్రామ సభలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ నెల 22న ఉదయం బురదకోట, కొండపల్లి, మధాహ్నం బాపన్నధార, కె.మిర్తివాడ, 23న పాండవులపాలెం, 24న బవురువాక, దోపర్తి, తాడువాయి, 25న వెంకటనగరం, తోటపల్లి, 26న ఉద్దండ జగన్నాథపురం, 29న పోతులూరు, నవంబర్ 1న వాకపల్లి, 2న గజ్జనపూడి, కొత్తూరు, 5న శరభవరం, 6న ఉత్తరకంచి, రౌతుపాలెం, 7న లంపకలోవ, 8న ఉలిగోగుల, మెట్టుచింత, 12న ఎరకంపాలెం, 13న ఆరెళ్లధార, గోకవరం, వేములపాలెం, 14న వంతాడ, సీముసురు, 15న పెదశంకర్లపూడి, 16న చినశంకర్లపూడి, 18న ఏలూరు, 19న టి.రాయవరం, 21న రాచపల్లి, 22న ధర్మవరం, 23న ప్రత్తిపాడు, 24న పెద్దిపాలెం గ్రామాల్లో సభలు జరుగుతాయని తహసీల్దార్ వివరించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ కె.పుణ్యవతి, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అవసరాల గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### ఏపీఎం శ్రీనివాస్‌కు సత్కారం



ఏపీఎం శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న వీఓఏలు, సిబ్బంది

**కిర్లంపూడి:** స్థానిక వెలుగు కార్యాలయంలో ఏపీఎంగా విధులు నిర్వహించి శంఖవరం మండలానికి బదిలీపై వెళ్లిన ఇనకోటి శ్రీనివాస్ సేవలు ప్రశంసనీయమని పలువురు వక్తలు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో వీఓఏలు, సిబ్బంది సోమవారం ఆయనను శాలువా, పూలమాలతో సత్కరించారు. ఆయన సేవలను కొనియాడారు. అలాగే కొత్తగా విధుల్లో చేరిన సీసీలు బుల్లియ్య, సత్యప్రసాద్, శాంతలకు శుభాకాంక్షలు తెలిపారు. ఏపీఎం శరకణం వేదకుమారి, సీసీ లోవరాజు ఉన్నారు.

# పత్తి.. నష్టాలు ముంచెత్తి..



ఎస్.చామవరంలో సాగు చేస్తున్న పత్తిపంట



వర్షానికి తడిసిన మొక్కకు వేలాడుతున్న పత్తి

- భారీ వర్షానికి తడిసి ముద్దయిన పంట
- కొనుగోళ్లు నిలిపివేసిన వ్యాపారులు

**తుని రూరల్:** రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పత్తిపంట ఫలసాయం వర్షార్పణమైంది. తొలి పంట చేతికి అందకముందే వరుణుడు తడిపేశాడు. జూన్ నెలలో పత్తి పైర్లను రైతులు వేయగా తరుచూ వర్షాలు కురుస్తుండడంతో అధిక తేమకు కొన్ని మొక్కలు చనిపోగా మిగిలిన మొక్కలు ఏపుగా ఎదిగాయి. పూత, పిందెలు, కాయలతో ఉన్న పంట కొద్దిరోజుల్లో చేతికి అందుతుందని రైతులు ఆశించారు. ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మొక్కలపై ఉన్న పత్తి తడిసి ముద్దమైంది. దీంతో తొలిపంటను నష్టపోవలసి వచ్చిందని వి.కొత్తూరు, ఎస్.చామవరం, హంసవరం, హెచ్.కొత్తూరు, టి.తిమ్మాపురం, చేపూరు, కొలిమేరు తదితర గ్రామాలకు చెందిన పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వాతావరణం అనుకూలిస్తే ఈ వారంలో పత్తి సేకరించి విక్రయించుకునేవారమని తెలిపారు. వ్యాపారులు సైతం ఇటీవల కొనుగోలు కేంద్రాలను తెరిచారు. కిలో రూ.55 చొప్పున ధర నిర్ణయించి కొనుగోళ్లకు శ్రీకారం చుట్టారు. ఇప్పుడు తడిసిన పత్తిని కొనుగోలు చేసేందుకు వ్యాపారులు విముఖత వ్యక్తం చేయడంతో పొలాల్లోనే పత్తిని సేకరించకుండా రైతులు వదిలేశారు. రెండు మూడు రోజులు ఎండలు కాస్తే అప్పుడు పత్తి సేకరిస్తామని రైతులు తెలిపారు. వ్యవసాయశాఖ సబ్ డివిజన్ తుని, కోటనందూరు, తొండంగి, శంఖవరం, రౌతులపూడి మండలాల పరిధిలో 582 ఎకరాల్లో ఈ సంవత్సరం పత్తి సాగవుతుంది. ఆరుతడిగా సాగయ్యే పత్తి చేలల్లో వర్షపునీరు నిల్వ లేకుండా కాలువలు ద్వారా బయటకు తీసివేయాలని వ్యవసాయ సహాయ సంచాలకులు సుంకర బుల్లిబాబు సూచించారు.